క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయండి



సమావేశమైన సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు

మడకశిరరూరల్: గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర యాదవ్, కన్వీనర్ రామిరెడ్డి, ఎంపీపీ కవిత తెలిపారు. శుక్రవారం చందకచెర్లు పంచాయతీలో బూత్‌స్థాయి కమిటీల ఏర్పాటు, పార్టీ బలోపేతంపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవడంలో గ్రామ స్థాయి కమిటీలు, కన్వీనర్లు, గృహసారథులు కీలక పాత్ర పోషించాలన్నారు. తాలుకా బూత్ కమిటీ మేనేజర్ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ బజ్జప్ప, సర్పంచ్ ప్రభావతిబాయి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మంజునాథ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


అరవింద్


పల్లవి


శ్రీలత


పావని

లేపాక్షి: మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పావని, శ్రీలత, పల్లవి, అరవింద్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, ఫిజికల్ డైరెక్టర్ రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. అక్టోబర్ 30న అనంతపురం ఆర్డీటీ క్రీడా మైదానంలో నిర్వహించిన ఉమ్మడి అనంతపురం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా అండర్–17 ఫుట్‌బాల్ పోటీల్లో విద్యార్థినులు ప్రతిభ కనబరిచి అనంతపురం జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకూ జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను సర్పంచ్ అశ్వత్థనారాయణ, జేకే ప్రభాకర్, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు మంజునాథ్ తదితరులు అభినందించారు.

పాఠశాలలకు వంట పాత్రల పంపిణీ



వంట పాత్రలను అందిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలోని 109 ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్నం భోజనం వంట పాత్రలను ఎండీయూ వాహనం ద్వారా సరఫరా చేశామని ఎంఈఓ భాస్కర్ తెలిపారు. శుక్రవారం మెళవాయి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ అధ్యక్షుడు శివానంద్ నిర్వాహకులకు వంట పాత్రలను అందించారు. కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ భోజన పథకం నిర్వహకులు వంట గదిని, పాత్రలను పరిశుభ్రంగా ఉంచుకుని మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు.

బొలెరో సీజ్

సోమందేపల్లి: నిబంధనలు పాటించకుండా ప్రయాణికులతో వెళ్తున్న బొలెరో వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. గార్లదిన్నె నుంచి కర్ణాటకలోని విదురఅశ్వర్థం వెళ్లేందుకు 20 మందితో బొలెరో బయల్దేరింది. స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎస్ఐ గుర్తించి వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. ట్రాఫిక్ నిబంధనలపై డ్రైవర్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆహార పదార్థాలు నాణ్యతగా ఉండాలి



పాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: ఆహార పదార్థాలు నాణ్యతగా ఉండాలని ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ తస్లీం సూచించారు. శుక్రవారం పాపిరెడ్డిపల్లి వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. వంట గది, ఆహార పదార్థాల నిల్వ ఉన్న స్టోర్ రూంలను పరిశీలించారు. ఆహార పదార్థాల ప్యాకెట్లపై గడువుతేదీ ముద్రించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట గది శుభ్రంగా ఉంచుకోవాలని, మెనూ ప్రకారం భోజనం సిద్ధం చేయాలన్నారు. పాల ప్యాకెట్లు, భోజన రుచిని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఓ అనిత తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పూర్తికి చర్యలు



మడకశిర సరస్వతీ విద్యామందిరం ఉన్నత పాఠశాలలో సర్వే పరీక్షను పరిశీలిస్తున్న డీఈఓ మీనాక్షి

మడకశిర: జిల్లా వ్యాప్తంగా నాడు-నేడు పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని డీఈఓ మీనాక్షి తెలిపారు.ఆమె శుక్రవారం పట్టణంలోని సరస్వతీ విద్యామందిరం ఉన్నత పాఠశాలలో స్టేట్ ఎడ్యుకేషనల్ అసెస్‌మెంట్ సర్వే పరీక్షను పరిశీలించారు. తర్వాత ఎంఈఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. వివిధ రికార్డులను పరిశీలించారు. మండలంలోని రెండో విడత నాడు-నేడు పనులపై ఎంఈఓలతో సమీక్షించారు. ఎన్ని పాఠశాలల్లో నాడు-నేడు పనులు జరుగుతున్నాయి, పనుల పురోగతి ఎలా ఉంది తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల అటెండెన్స్ యాప్‌పై కూడా ఆరా తీశారు. స్టేట్ ఎడ్యుకేషనల్ అసెస్‌మెంట్ పరీక్షను చాలా బాగా నిర్వహించారని ఆమె ఎంఈఓలను అభినందించారు. ఎంఈఓలు భాస్కర్, నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.

మడకశిరరూరల్: మండలంలోని 26 పాఠశాలల్లో 3,6,9 తరగతుల విద్యార్థులకు శుక్రవారం స్టేట్ ఎడ్యుకేషన్ అసెస్‌మెంట్ సర్వే (అభ్యసన సామర్థ్య పరీక్ష) నిర్వహించారు. ఆమిదాలగొంది జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో డీఈఓ మీనాక్షి పరీక్ష నిర్వహణను పరిశీలించారు. పరీక్షకు 1,069 విద్యార్థులు హాజరయ్యారు. రెండో విడత నాడు-నేడు పనుల ప్రగతి, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును డీఈఓ ఎంఈఓ భాస్కర్‌ను అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ తర్వతిగతిన నాడు-నేడు పనులను పూర్తి చేయించాలన్నారు. విద్యార్థుల్లో మరింతగా విద్యాప్రమాణాలు మెరుగుపర్చడానికి కృషి చేయాలన్నారు. ఎంఈఓలు, ఫీల్డ్ ఇన్విస్టిగేటర్లు , హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడిబండ: మండలంలోని వివిధ పాఠశాలల్లో 3,6,9 తరగతుల విద్యార్థులకు శుక్రవారం అభ్యసన సామర్థ్య పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 676 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓ గంగన్న తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఇన్విస్టిగేటర్లు ,హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో శుక్రవారం స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షలు సజావుగా జరిగాయి. ఎంఈఓ 2 వెంకటరమణనాయక్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఎఫ్ఐలు, ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అగళి: మండలంలోని వివిధ పాఠశాలల్లో 3,6,9 తరగతుల విద్యార్థులకు శుక్రవారం అభ్యసన సామర్థ్య పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 647 మంది విద్యార్థులు హజరయ్యారని ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడ్ తెలిపారు.

రొళ్ల: మండలంలోని వివిధ పాఠశాలల్లో 3,6,9 తరగతుల విద్యార్థులకు శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అభ్యసన సామర్థ్య పరీక్ష నిర్వహించారు. మొత్తం 629 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ఎంఈఓ-2 శ్రీధర్ తెలిపారు.

పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేద్దాం

హిందూపురం: హిందూపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలపేతానికి సమష్టిగా కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టి.ఎన్.దీపిక అన్నారు. శుక్రవారం చౌళూరు మధుమతిరెడ్డి నివాసంలో విందుకు సమన్వయకర్త దీపిక, పార్టీ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి హాజరయ్యారు. అనంతరం సమన్వయకర్త మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధితో పాటు 2024 ఎన్నికల్లో విజయే లక్ష్యంగా కలిసికట్టుగా ముందుకు సాగుదామన్నారు. పార్టీ బలపేతంతో పాటు గెలుపే లక్ష్యంగా ప్రణాళికలతో ముందుకువెళ్లాలని చర్చించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, బాబురెడ్డి, అనిల్‌రెడ్డి, తిమ్మారెడ్డి, నాగమణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

మడకశిరరూరల్: అయ్యవారిపల్లి వద్దనున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నీలకంఠాపురం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బంది 132 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు, ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



చెక్కు అందిస్తున్న చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు గురువారం రాత్రి ఎమ్మెల్యే తిప్పేస్వామి తన స్వగృహంలో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన అమృతకు రూ.1.50 లక్షలు, అమరాపురం మండలానికి చెందిన సావిత్రమ్మకు రూ.70 వేలు మంజూరైంది. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలను ఆదుకోవడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ధ్యేయమన్నారు. సీఎం సహాయనిధి ద్వారా పేదలకు అండగా నిలబడుతున్నారని తెలిపారు.

జాతీయస్థాయి రైఫిల్ పోటీలకు ఎంపిక



రైఫిల్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

మడకశిరరూరల్: నీలకంఠాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు గణేష్, కావ్య రాష్ట్ర స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయి రైఫిల్ పోటీలకు అర్హత సాధించారని పీఈటీ రాజేష్ శుక్రవారం తెలిపారు. గత నెల 28 నుంచి మూడు రోజులు పాటు రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాఠశాల నుంచి 18 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఇందులో గణేష్, కావ్య ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి స్టాండ్ బైగా ఎంపికయ్యారని తెలిపారు. వీరిని మాజీ మంత్రి రఘువీరారెడ్డి, హెచ్ఎం చంద్రమౌళిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

కొడిగెనహళ్లి సర్పంచ్ శ్రీరామప్ప మృతి



శ్రీరామప్ప మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పరిగి: కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ శ్రీరామప్ప (73) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. కొన్ని నెలలుగా శ్రీరామప్ప అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. గురువారం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం తెల్లవారుజామున సర్పంచ్ శ్రీరామప్ప మృతి చెందాడు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ శ్రీరామప్ప భౌతికదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని, పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే సోదరుడు మాలగుండ్ల రవీంద్ర, ఎంపీడీఓ సరస్వతి, తహసీల్దారు సౌజన్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

ప్రజా ఆరోగ్యమే లక్ష్యం



మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ ఉమర్ ఫరూక్ ఖాన్



ఆరోగ్య సురక్ష బుక్‌లెట్ అందిస్తున్న చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ నాయకులు

హిందూపురం: కుటుంబ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్ జబీవుల్లా, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 15, 26వార్డుల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసి ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషిచేస్తున్న సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. గత టీడీపీ పాలనలో ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేశారని, వైద్యం పేరిట దోపిడీ సాగిందన్నారు. అనంతరం కంటిపరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి, జేసీఎస్ జిలా కన్వీనర్ మారుతిరెడ్డి, ఏ బ్లాక్ కన్వీనర్ సీపీసీ సాధిక్, కౌన్సిలర్లు శివ, ఆసీఫ్‌వుల్లా, మల్లికార్జున, జేసీఎస్ కన్వీనర్లు శివశంకర్‌రెడ్డి, దాదు, నాగరాజు, డాక్టర్ బాషా, ఫరూక్, చాంద్‌బాష, నౌషాద్, భాను, భారతి, వసీం, మున్సిపల్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని నగర పంచాయితీ చైర్మన్ ఉమర్‌ఫరూక్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 5వ సచివాలయం పరిధిలో సెంట్రల్ స్కూల్ ప్రాంగణంలో నగర పంచాయతీ పరిధిలో జగనన్న సుక్ష కార్యక్రమం కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ ఆధ్వర్యంలో జరిగింది. చైర్మన్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. జగనన్న సురక్ష కిట్లు, కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు, వైద్య సిబ్బంది వైఎస్సార్‌సీపీ నాయకులు బోయ బాబు, శ్రీరాములు, ఫరీద్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కోగిర విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రొద్దం: రాష్ట్రస్థాయి పోటీలకు కోగిర జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం నారాయణరెడ్డి, పీఈటీ శ్రీదేవి తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు అశోక్, విజయ్ ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ విభాగం, సీనియర్ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రతిభ చూపినట్లు తెలిపారు.

సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైతే ఎలా?



అధికారుల గైర్హాజరుపై నిలదీస్తున్న జెడ్పీటీసీ జయరాంనాయక్

గోరంట్ల: మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరయితే ఎలా? అని జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాంనాయక్, సర్పంచులు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఏపీఎంఐపీ అధికారితోపాటు పలుశాఖల అధికారులు గైర్హాజరయ్యారు. సమావేశానికి అధికారులు రాకపోతే సమస్యలపై ఎవరిని అడగాలని ఎంపీడీఓను రఘునాథగుప్తను సభ్యులు నిలదీశారు. ఎంపీపీ ప్రమీల కలగజేసుకొని విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల సౌకర్యర్థం పాలసముద్రం, బూదిలి, మందలపల్లి గ్రామల్లో రాగి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి తెలిపారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వ సంస్కరణలు, వాటి ఫలితాలను ఎంఈఓ జాన్‌రెడ్డప్ప సమావేశంలో తెలియజేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు నాగభూషణరెడ్డి, కురబ రామలక్ష్మమ్మ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బూదిలి వేణుగోపాల్‌రెడ్డి, వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు , సర్పంచులు, సహకార సంఘాల అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అధికారుల నిర్లక్ష్యం..బాధితుడికి శాపం

రొద్దం: అధికారుల నిర్లక్ష్యంతో పింఛన్ కోల్పోయినట్లు తురకలాపట్నం గ్రామానికి చెందిన కిడ్నీ బాధితుడు వెంకటరామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. శుక్రవారం విలేకరులతో గోడు వెల్లబోసుకున్నాడు. వారానికి రెండుసార్లు హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నట్లు తెలిపాడు. గతంలో తనకు రూ.10 వేలు పింఛన్ వచ్చేదని, అధికారులు సెర్ప్‌కు వివరాలు పంపకపోవడంతో రెండు నెలలుగా తనకు పింఛన్ రాలేని ఆవేదన వ్యక్తం చేశాడు. జిల్లా అధికారులు స్పందించి పింఛన్ వచ్చేలా చూడాలని కోరాడు.

పాఠశాలల్లో 'కన్నడ' కార్యక్రమాలు

పావగడ: తాలూకా వ్యాప్తంగా ఉన్న 103 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో కన్నడ భాషపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు శనివారం నుంచి ప్రారంభించనున్నారు. ఈమేరకు స్థానిక తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి శుక్రవారం తెలిపారు. తొలుత అత్యంత తెలుగు భాషా ప్రభావమున్న నాగలమడక హోబళి తిరుమణిలోని ప్రభుత్వ పాఠశాల లో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాల్లో నిష్ణాతులైన కన్నడ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సాహితీవేత్తలు, చరిత్ర కారులు, కవులు ప్రసంగిస్తారన్నారు.

క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ఇద్దరు అరెస్ట్

హిందూపురం అర్బన్: హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలో శుక్రవారం రాత్రి క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న నరేష్, తిరుమలేష్‌ను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.20 వేలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వి. శ్రీనివాసులు తెలిపారు. క్రికెట్ బెట్టింగ్‌పై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఎస్ఐ హరూన్‌బాషా, కానిస్టేబుళ్లు నరేష్, వెంకట్రామిరెడ్డి దాడుల్లో పాల్గొన్నారు.

నోటుపుస్తకాల పంపిణీ

పావగడ: అరసికెర ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పూర్వ విద్యార్థి కేఎస్ గోపినాథ్ తల్లిదండ్రులు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. గోపినాథ్ దుబాయ్‌లో యోగా, ఆయుర్వేద ప్రచారకుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. తమ కుమారుడి తొలి వేతనంతో విద్యా సామగ్రి అందిస్తున్నట్లు శివానందప్ప, శ్రీదేవి తెలిపారు. హెచ్‌ఎం గోవిందప్ప, ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు గురురాజ్, సహోపాధ్యాయుడు రేణుకారాజ్ పాల్గొన్నారు.

స్థల వివాదంతో ఇంటిపై దాడి

పావగడ: స్థల వివాదంలో ఓ ఇంటిపై దాడి చేసి సోలార్ పైపులు, కిటికి అద్దాలు, సింటెక్స్ డ్రమ్ము ధ్వంసం చేసిన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పి రొప్ప గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు..గ్రామానికి చెందిన బాబయ్య ఇంటి స్థలంపై కోర్టు స్టే ఇచ్చింది. ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేని కొంత మంది బాబయ్య ఇంటిపై దాడి చేసి సోలార్ పైపులు, కిటికీ అద్దాలు, సింటెక్స్ ధ్వంసం చేశారు. సుమారు రూ 80 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు బాబయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ధ్వంసం చేసింది పక్కింటికి చెందిన మల్లికార్జున, హరీశ్, శోభలే నని బాబయ్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో మాజీ డీలర్ మృతి

రొద్దం: మండలంలోని గౌరాజుపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ డీలర్ సుధాకర్‌రెడ్డి (42) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. వైఎస్సార్ సీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి మృతదేహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆర్థికసాయం

రొద్దం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన లక్ష్మమ్మ అనే వృద్ధరాలికి బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపకుడు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. బహుజన చైతన్య వేదిక గౌరవ అధ్యక్షుడు వెంకటేసులు, రామకృష్ణ, నరసింహమూర్తి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రొళ్ల: దొమ్మరహట్టి వద్దనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో 2023–24 విద్య సంవత్సరానికి గాను తాత్కాలిక పద్ధతి టీజీటీ, పీజీటీ ఫిజిక్స్ టీచర్ల పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మైలారప్ప శుక్రవారం తెలిపారు. అభ్యర్థులు జిల్లా కోఆర్డినేటర్ ఆఫీస్ లేదా సంబంధిత స్కూల్‌లో సంప్రదించాలని కోరారు.

అక్రమ కట్టడాలను అడ్డుకున్న ప్రజలు

పెనుకొండ రూరల్: కాలువలో అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీని తిమ్మాపురం, ఇస్లాపురం గ్రామస్తులు శుక్రవారం అడ్డుకున్నారు. నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం మలుపు వద్ద హెచ్‌పీ సమీపంలోని ముత్యాలు చెరువుకు వెళ్లే కాలువ పక్కన ప్రహరీ నిర్మాణం చేపట్టడంతో ఎగువ ప్రాంతంలోని కొందరు రైతులు అడ్డగించారు. ఇరిగేషన్ జేఈ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ కట్టాడాలు నిర్మిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. ప్రహరీ నిర్మాణంలో కొంత మేర మాత్రమే ముందు జరిగారని, ఇదివరకే యజమానిని హెచ్చరించి, పరిమితులకు లోబడి నిర్మాణాలు చేపట్టాలని సూచించినట్లు తెలిపారు.

రాగుల కొనుగోలు కేంద్రాల ప్రారంభం

అగళి: మండలంలోని అగళి, పీ బ్యాడిగెర ఆర్‌బీకేల్లో శుక్రవారం ఏఓ శేఖర్ నాయక్ ఆధ్వర్యంలో రాగుల కొనుగోలు కేంద్రలను ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి ఫణిరాజు, సీఈఓ భోజన్న, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు శ్రీరంగరాజుపల్లి విద్యార్థి



కావ్యను అభినందిస్తున్న ఎంఈఓ- 2 శేషాచలం, హెచ్‌ఎం వెంకటేష్ తదితరులు

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కావ్య రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయినట్లు హెచ్‌ఎం వెంకటేష్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 2న అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రాంగణంలో జిల్లా స్థాయి పోటీల్లో పెనుకొండ నియోజకవర్గం తరపున వాలీబాల్ పోటీలో కావ్య పాల్గొని, ప్రతిభ కనబరిచింది. జిల్లా స్థాయి మొదటి స్థానంలో రాణించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 9 నుంచి 11 తేదీ వరకూ అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో కావ్య పాల్గొనబోతున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. కావ్యను హెచ్‌ఎంతో పాటు ఎంఈఓ-2 శేషాచలం, పీడీ వెంకటేశులు, ఉపాధ్యాయులు అభినందించారు.

మోటారు, కేబుల్ చోరీ

అమరాపురం: కెంకెర గ్రామానికి చెందిన దొడ్డయ్య తోటలో రూ.50 వేల విలువైన విద్యుత్ మోటార్, కేబుల్ చోరీకి గురైనట్లు బాధితుడు దొడ్డయ్య తెలిపారు. బోరు బావిలో ఉన్న మోటర్ చెడిపోవడంతో పైకి లాగి పొలంలోనే వదిలిపెట్టామన్నారు. గురువారం ఉదయం వెళ్లి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశామన్నారు.

పేకాట స్థావరంపై దాడి

రొద్దం: మండలంలోని ఆర్. మరువపల్లి సమీపంలో పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడులు చేసినట్లు ఎస్ఐ వలీబాషా తెలిపారు. అందులో నలుగురు జూదర్లు పట్టుబడినట్లు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి రూ. 6 వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమెదు చేశామన్నారు.

బంద్ విజయవంతం చేయండి

హిందూపురం టౌన్: కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎన్‌జీఓ హోంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి చర్చించారు. ఆంధ్రుల హక్కు నినాదంతో విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడి సాధించుకున్నామన్నారు. అలాంటి విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు పరం చేస్తుంటే చూస్తూ ఊరుకోమన్నారు. అలాగే కడపలో కేంద్ర ప్రభుత్వమే ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తమరెడ్డి

చిలమత్తూరు: గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు చేపట్టనున్నట్టు ఎంపీపీ పురుషోత్తమరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. వివిధ శాఖల అధికారులు చేపట్టిన, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణు మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ పనులు పెండింగ్ ఉన్న చోట్ల ప్రభుత్వమే కమ్యూనిటీ కాంట్రాక్ట్ పద్ధతిలో చేపడుతుందన్నారు. అలాగే డ్రైన్ల వ్యయం పెంచాలని పలువురు ప్రజా ప్రతినిధులు కోరారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు త్వరతిగతిన పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ నరేష్‌కృష్ణ సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఎస్ఐ గంగాధర్ తెలిపారు. అర్హులందరికీ ఇంటి పట్టాలిస్తామని ఎంపీపీ అన్నారు. కార్యక్రమంలో ఏఓ రామ్‌కుమార్, వైస్ ఎంపీపీ బయప్ప, సర్పంచ్‌లు మురళి, శంకర్‌రెడ్డి, సంధ్య, లక్ష్మీపతిరెడ్డి, నీలీబాయి, ఎంపీటీసీలు జగన్మోహన్‌రెడ్డి, శిల్ప, రాఘవేంద్రరెడ్డి, ఆదినారాయణ, సనమ్‌హుస్నా, కవిత, టి.కవిత, సింగిల్‌విండో చైర్మన్లు హనుమంతరెడ్డి, దివాకర్‌రెడ్డి, అమర్నాథ్, అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల మైదానంలో శ్రమదానం

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శుక్రవారం శ్రమదానం నిర్వహించారు. విజిలెన్స్ వీక్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులు శ్రమదానంలో భాగంగా కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించి, ఆవరణాన్ని శుభ్రపరిచారు. కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు విద్యార్థుల సేవా నిరతిని కొనియాడారు. ఎన్ఎస్ఎస్ పీఓలు కాంతారావు, రంగనాయకులు, అధ్యాపకులు డాక్టర్ జయప్ప, డాక్టర్ ప్రతాప్, డాక్టర్ యశోద తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలి

గోరంట్ల: వాహన యజమానులు, డ్రైవర్లు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని సీఐ సుబ్బరాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్లు, వాహన యజమానులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ రోజురోజుకూ ప్రమాదాలు పెరిగిపోతున్నాయని, తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. ప్రైవేట్ వాహన యాజమానులు రికార్డులు అప్‌డైట్‌గా ఉంచుకోవాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు మద్యం సేవించరాదని, అతివేగం మంచిదికాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.